పద్ధతి నేర్పుతున్న 'ప్రార్థన'

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం
- తెలుగు, హిందీ, ఆంగ్లంలో గేయాల ఆలాపన
- విద్యార్థులతో దినపత్రికలను చదివిస్తూ..
- వారిలో భాష నైపుణ్యం పెంపొందించేలా..


ఎల్వి పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

తానూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ బడుల్లో ప్రతిరోజు ఉదయం ప్రార్థన విధానంలో మార్పులు వచ్చాయి. విద్యార్థుల గేయాల ఆలాపనతోపాటు పలు మార్పులు చోటు చేసుకున్నాయి. విజ్ఞానం తోపాటు క్రమశిక్షణ, పద్ధతి అలవర్చుకునేలా ప్రార్థన అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వందే మాతరంతో ప్రారంభమై జాతీయ, రాష్ట్రగీతాలు, జనగణమన, జయజయహే తెలంగాణ తదుపరి ప్రతిజ్ఞ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సోమ, మంగళవారాల్లో (తెలుగు), బుధ, గురువారాల్లో (హిందీ), శుక్ర, శనివారాల్లో (ఆంగ్లం) ప్రార్థన నిర్వహిస్తున్నారు.

సమాచార స్రవంతి

ప్రతిజ్ఞ ముగియగానే విద్యార్థులు పలు విజ్ఞాన విషయాలు నేర్చుకోవడానికి ప్రార్థన వేదిక ఉపయోగపడుతోంది. ప్రతిరోజు ఒక్క విద్యార్థితో తెలుగు, ఆంగ్లంలో దినపత్రికల్లో వచ్చిన వార్తలు చదివిస్తారు. దీనిలో రెండు అంతర్జాతీయ, రెండు జాతీయ, రాష్ట్రానికి చెందినవి రెండు, జిల్లాకు చెందిన రెండు ముఖ్య విషయాలను చదివిస్తున్నారు. దీని ముఖ్యోద్దేశం సమకాలీన అంశాలపై వారికి అవగాహన కలుగుతోంది. ముఖ్యంగా శాస్త్రవేత్తలు, కనుగొన్న ఆవిష్కరణలు, ప్రపంచ వింతలు, గ్రంథాలు వాటి రచయితలు, దేశ ప్రముఖులు ఇలా పలు అంశాల ప్రశ్నలు ఉంటున్నాయి. నిన్న (కిందటి రోజు) విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులే సమాధానాలు చెప్పి అంశాన్ని క్షుణ్ణంగా వివరిస్తారు. దీన్నే నేటిప్రశ్న..నిన్నటి జవాబు అని పిలుస్తారు.

ఆ రోజు ప్రాముఖ్యత గురించి

చరిత్రలో ప్రతిరోజు ఒక్క ప్రాముఖ్యత ఉంటుంది. చరిత్రలో జరిగిన సంఘటనలు నుంచి మొదలు జాతీయ నాయకులు, శాస్త్రవేతల జయంతి, లేదా వర్ధంతి, ఆవిష్కరణ, ఉద్యమం విశిష్టతలు ఇందులో ఉంటాయి. వీటిని హెచ్‌ఎంలు కాని సంబంధిత టీచర్లు కాని విద్యార్థులకు ఆరోజు అంశంపై వివరిస్తారు. ఆ రోజు ఎవరైన విద్యార్థి పుట్టినరోజు ఉంటే మిగతావారితో శుభాకాంక్షలు తెలియజేస్తారు.

నిత్యం నల్లబల్లపై నమోదు

ఆ రోజు ప్రార్థనలో జరిగిన అన్ని విషయాలను పాఠశాల ఆవరణలో ఉన్న నల్లబల్లపై నమోదు చేస్తారు. నిన్నటి ప్రశ్న నేటి జవాబు చెప్పిన విద్యార్థి పేరు, సూక్తి ఆరోజు ప్రత్యేకత. ఇలా అన్ని విషయాలను నమోదు చేస్తారు. వీటిని వారితో పదేపదే చదవడం ద్వారా వారిలో జిజ్ఞాస పెంపొందే ఆవకాశం ఉంది. ఒకప్పుడు ప్రైవేటు బడుల్లో కనిపించే ఈ వాతావరణం ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తోంది. కేవలం తెలుగులో కాకుండా ఆంగ్లం భాషలో విషయాలు చెప్పిస్తూ విజ్ఞానంతోపాటు భాష నైపుణ్యం పెంపొందించేలా పాఠశాల ప్రార్థన అసెంబ్లీ) తోడ్పడుతోంది.

కొత్త విషయాలు చేర్చుకుంటున్నాం



పాఠశాలలో ప్రతిరోజు నిర్వహించే ప్రార్థనలో కొత్త విషయాలు చేర్చుకుంటున్నాం. సమయపాలన పెంపొందడం తోపాటు వేదిక మీద మాట్లాడే భయం పోతుంది. రోజు కొత్త విషయాలు నేర్చుకుంటున్నామనే భావన కలుగుతోంది. రోజు ప్రశ్న సమాదానాలు వార్తలు చెప్పడం ఎంతో ఉత్సాహంగా ఉంది.

– అఖిల, 9వ తరగతి, విద్యార్థిని

ఉత్సాహంగా పాల్గొంటున్నాం



పాఠశాలలో నిర్వహించే ప్రార్థనలో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. జాతీయ గీతం, రాష్ట్రగీతం, ప్రశ్న జవాబులతో ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాం.

– అశ్విత, 9వ తరగతి

భాషా నైపుణ్యం పెరుగుతోంది



ప్రార్థనలో విద్యార్థులు పత్రికల్లో వచ్చే వార్తలు చదవడం నమోదు చేయడం వల్ల భాషా నైపుణ్యం పఠనాసామర్థ్యం పెరుగుతుంది. విజ్ఞానాన్ని ఎంతో సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుంది. ప్రతిరోజు కొత్త విషయాలు చెప్పడంతో విద్యార్థులకు అసెంబ్లీ ఎంతో ఉపయోగపడుతోంది.

– భూమన్నయాదవ్ పాఠశాల హెచ్‌ఎం, ఎల్వి

క్లుప్తంగా

బీడీకార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విలాస్

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం బీడీకార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్.విలాస్ పేర్కొన్నారు. పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఎంతోమంది కార్మికులు, టేకేదారుల దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. నాణ్యమైన ఆకు, తంబాకు ఇవ్వకపోవడంతోపాటు బీడీల్లో టేకేదారులు కోతలు విధిస్తున్నారని అన్నారు. లైసెన్స్‌లు లేకుండా, ఒక్కో లైసెన్సుపై రెండేసి కంపెనీలు నడుపుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కటాఫ్ తేది, పీఎఫ్‌తో సంబంధం లేకుండా కార్మికులందరికీ జీవనభృతి రూ.2016 చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎల్‌ఆర్ ఉపాలి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్‌రెడ్డి, నాయకులు రవి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ పీవోను కలిసిన నాయకులు


వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుభీర్: మండలానికి చెందిన నాయకులు బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, ఎంపీటీసీ రాథోడ్ శ్యాంరావ్‌లు శనివారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని కార్యాలయంలో కలిశారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని, ఐటీడీఏ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సబ్సిడీ డబ్బులు త్వరగా అందేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గిరివికాస్ పథకం కింద బోరుమోటార్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు పీవో సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కోరారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఈనెల 18 నుంచి చేపట్టే కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కబీల్, కౌన్సిలర్లు, నాయకులు సంతోష్, శ్రీనివాస్, శంకర్, సురేశ్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, బండారి కిశోర్, కమిషనర్ రత్నాకర్‌రావు, సీఐ అజయ్‌బాబు ఉన్నారు.

మైనార్టీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పల్లవి ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 40 ఖాళీలు ఉన్నాయని, ఇందులో మైనార్టీ బాలికలు 30, బీసీలు 5, ఓసీ 1, ఎస్సీలు 2, ఎస్టీలు 2 చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తుతోపాటు, ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నెంబర్ జతపర్చి పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్7331117088 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓటరు నమోదుపై కళాజాత

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో శనివారం జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కరోనా వైరస్ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆటపాటల రూపంలో కళాకారులు వివరించారు. పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణరెడ్డి, కళాజాత బృందం సుదర్శన్, రఘునాథ్, సుదర్శన్‌స్వామి, రమేశ్, రాజ్‌కుమార్, రాజు, రాజలింగు, సాయి, లక్ష్మణ్, జితేందర్, శ్రీలత, తస్లిమా, మాధవి, నర్సయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బడి బయట పిల్లల కోసం సర్వే

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో సీఆర్పీలు శనివారం బడి బయట పిల్లల కోసం సర్వే నిర్వహించారు. కనకాపూర్, బాబాపూర్ గ్రామాల్లో ఇటుక బట్టీల్లో ఉన్న ఆరుగురిని సీఆర్పీ సుధాకర్ గుర్తించారు. లక్ష్మణచాంద, తిర్పెల్లిలో సర్వే చేపట్టిన మరో సీఆర్పీ మహేందర్ ఇద్దరిని గుర్తించి సమీపంలోని పాఠశాలలో చేర్పిస్తామన్నారు.

వైకుంఠధామం పరిశీలన

కుంటాల : మండలంలోని అంబకంటి తండాలోని వైకుంఠధామాన్ని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించేలా నీరందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు శనివారం శబరికి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని విఠేలేశ్వర ఆలయంలో గోపాల్ గురుస్వామి వారికి ఇరుముడులు కట్టారు. అనంతరం కుటుంబ సభ్యులు వారిని మంగళహారతులతో సాగనంపారు. గురుస్వాములు పుండలిక్, సిద్దూ తదితరులు ఉన్నారు.

సారంగపూర్ మండలంలో..

సారంగపూర్: మండలంలోని జామ్, బోరిగాం గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు శనివారం శబరియాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గురుస్వామి సగ్గం రాజు, కరిపె పోతన్నలు స్వాములకు ఇరుముడులు కట్టించి శబరికి సాగనంపారు. ప్రత్యేక పూజల అనంతరం స్వాములు వాహనంలో తరలివెళ్లారు.

దూరవిద్యలో ప్రవేశాలకు గడువు పెంపు

లక్ష్మణచాంద: దూరవిద్య ప్రవేశాలకు ఈనెల 13 వరకు గడువు పొడిగించినట్లు ఓపెన్ పాఠశాల ఇన్‌చార్జి విజయభాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందడానికి విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైన తరగతి టీసీ, ఆధార్, రేషన్ కార్డులు, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. వివరాల కోసం సెల్ 9441032313 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వస్తాపూర్‌లో వైద్యశిబిరం

మామడ: మండలంలోని వస్తాపూర్‌లో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలు సోకిన వారికి వైద్యసిబ్బంది మందులు పంపిణీ చేశారు. హెచ్ఈవో కన్నయ్య, హెల్త్‌అసిస్టెంట్ రవి, ఏఎన్ఎం భాగ్య, ఆశ కవిత, హెచ్‌ఎం వంశీధర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

మామడ: తాను చదువుకున్న మండలంలోని పొన్కల్ పాఠశాలకు ఉపాధ్యాయుడు నీల రమేశ్.. బీరువాను విరాళంగా ప్రకటించాడు. రూ.14 వేలతో కొనుగోలు చేసిన బీరువాను హెచ్‌ఎం రాంచందర్‌కు శనివారం అందించారు. పొన్కల్ గ్రామానికి చెందిన రమేశ్ ప్రస్తుతం ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిర్మల్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ యు.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

లక్ష్మణచాంద: సోన్ మండలం పాక్‌పట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల్లో మొదటి 5 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 10 మంది విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ట్రస్టు సభ్యుడు దీపక్, హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు మధుకర్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

భైంసా: పట్టణంలోని మదీనా ఫంక్షన్‌హాల్‌లో శనివారం వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇటీవల పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా, ఇందులో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నీలం రమేశ్, జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్, ముధోల్ కోఆర్డినేటర్ ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నారులతో పనిచేయిస్తే చర్యలు

లక్ష్మణచాంద: చిన్నారులతో పని చేయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రమణారెడ్డి అన్నారు. లక్ష్మణచాంద, సోన్ మండలాల్లోని శనివారం బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో ఆపరేషన్ స్మైల్ బృందం సభ్యులు పర్యటించారు. పలు షాపులు, వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు చిన్నారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు పంపారు. అనంతరం ఎస్సై రమణారెడ్డి మాట్లాడుతూ చిన్నారులను పనుల్లో పెట్టుకున్న యాజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలల పరిరక్షణ అధికారి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త మమత, హెడ్‌కానిస్టేబుల్ షౌకత్, చిన్నయ్య, పీసీలు నరేశ్, వజ్రమ్మ పాల్గొన్నారు.

దుమ్ములేస్తోంది..

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ నుంచి నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ వరకు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కనకాపూర్–రత్నాపూర్ కాండ్లీ గ్రామాల మధ్యన అధికారులు పనులు నిర్వహిస్తున్నారు. మట్టి రోడ్డుపై నీటిని పట్టకపోవడంతో వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో దుమ్ము రావడంతో పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.


కనకాపూర్ సమీపంలో దుమ్ము వస్తున్న దృశ్యం

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) 2023 క్యాలెండర్‌ను సంఘ నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుక్య గోవింద్‌నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ యూనియన్ ముందుండి పోరాడుతుందన్నారు. అనంతరం పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, సిబ్బందికి క్యాలెండర్లను అందజేశారు. హెచ్‌ఎం నగేష్‌బాబు, ఉపాధ్యాయులు ప్రేంసింగ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో..

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సభ్యులు పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. వింజామర నరసింహస్వామి స్మారకార్థం దాత పుష్ప ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను సభ్యులకు అందజేశారు. అధ్యక్షుడు మనోహరస్వామి, కోశాధికారి కృష్ణస్వామి, సభ్యులు గీతా, స్రవంతి, విజయ్, రాజు, సంధ్యారాణి, సంతోశ్, ఫణీంద్ర, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ, తదితరులు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ఎంపీపీ మహిపాల్‌రెడ్డి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకుంటున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ అట్ల యశోద, నాయకులు పోతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

టాక్లిలో పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయాలి

భైంసారూరల్: టాక్లి గ్రామంలో పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. పోలింగ్‌కేంద్రం లింగా గ్రామంలో ఏర్పాటుచేయడంతో ప్రజలు, వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే ఏర్పాటుచేయాలని కోరారు. సంజీవ్, యశ్వంత్, గంగాధర్, ప్రకాశ్, రోహిదాస్, బాలాజీ, ఆనంద్‌రావు, గణేశ్, మారుతి, హన్మంత్‌రావు, సూర్యకాంత్, దేవురావు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయకమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, అధ్యక్షుడిగా నాగేందర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎల్.రమేశ్, ఏ.శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, ఏ.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రంజిత్‌రావు, కోశాధికారిగా గంగనర్సయ్య, ప్రచారకార్యదర్శులుగా మధుకర్, నవీన్, ముఖ్యసలహాదారుగా నారాయణరావు, అశోక్‌రావు, వేణుగోపాల్, మారుతి, రమేశ్, వెంకటప్పయ్య, బీసీ రాజన్న, నర్సింలు, రాజేందర్, మహిళా మండలి అధ్యక్షురాలిగా పద్మ, కార్యదర్శిగా గంగామణి ఎన్నికయ్యారు.

సీపీఐ ఆధ్వర్యంలో రిలేదీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

దస్తురాబాద్: మండల విద్యావనరుల కేంద్రం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విలాస్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ మండల అధ్యక్షుడు బుక్య రమేశ్‌నాయక్‌కు పూలమాల వేసి రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నిర్మించిన విద్యావనరుల కేంద్రం పూర్తయి రెండేళ్ల గడిచిందన్నారు. అధికారులు ఇప్పటికి ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. విధుల్లో ఇన్‌చార్జి ఎంఈవో నిర్లక్ష్యం, మండలానికి వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి కేంద్రాని ప్రారంభించాలని, నిధులపై దుర్వినియోగంపై విచారణ చేపట్టాలన్నారు. నాయకులు ఉపాలి, శంకర్, రాజలింగం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి


పోటీలో గెలుపొందిన విద్యార్థులు

కుంటాల: ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించాలని ఎంపీవో ముత్యం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులకు 'స్టోరీ టెల్లింగ్, స్పెషల్ విజార్డ్' అనే అంశంపై డ్యూటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు అభినవ్, గజానంద్‌లు స్పెషల్ విజార్డ్‌లో, స్టోరీ టెల్లింగ్‌లో కల్లూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఏ.కృష్ణశ్రీ, శ్రీజలు జిల్లా స్థాయికి ఎంపిక కాగా, వారిని అభినందించారు. జిల్లాలోని విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు కృషి చేస్తున్న ఎల్టా అధ్యక్షుడు రవీంద్రను ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం నర్సయ్య, సునీల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాహిద్‌పాషా, శంకర్, యువరాజ్, తిరుమల్‌రెడ్డి, భరత్, కృష్ణ, దుర్గా, అశ్విని పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి ఆంగ్లం పోటీలు నిర్వహించారు. స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ విభాగాల్లో మండలంలోని అంబారిపేట్, కడెం, లింగాపూర్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. స్టోరీ టెల్లింగ్‌లో లింగాపూర్ పాఠశాల విద్యార్థులు ప్రవళిక ప్రథమ స్థానం, అక్షయ (ద్వితీయ), స్పెల్ విజార్డ్‌లో ప్రసన్న ప్రథమ స్థానం, కేబీజీవీ విద్యార్థిని అర్చన ద్వితీయ స్థానం సాధించారు. పోటీలకు కన్వీనర్‌గా నరేందర్, కోకన్వీనర్‌గా వెంకటరాములు వ్యవహరించారు.

ఆంగ్లభాషలో ప్రతిభ పోటీలు

తానూరు: మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు శనివారం మండల స్థాయి ఆంగ్లభాషలో ప్రతిభ, కథల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చినవారిని జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం భూమన్నయాదవ్, ఆంగ్ల ఉపాధ్యాయులు నరేందర్ కుమార్, పండరీ, భోజారాం, మైనోద్దీన్, సుజాతదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన డెబ్బిడి హరీష్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ముధోల్ తాలుకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రోల్ల రమేశ్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట లోకేశ్వరం మున్నూరుకాపు అధ్యక్షుడు మంద లింగన్న, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, గ్రామస్తులు దేవేందర్, పోతన్న, అనిల్, భోజన్న ఉన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి'

భైంసాటౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని టీజీవీపీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

కుభీర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం –1ని ఎంపీవో కవిరాజు, ఈవో విజయ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం అందిస్తున్న వివరాలు, గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త సత్యశీల ఉన్నారు.

ఘనంగా బాలయ్య వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: గంగపుత్రులకు సందిరి బాలయ్య సేవలు మరువలేనివని నిర్మల్ గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు ముత్యం అన్నారు. జిల్లా గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో సందిరి బాలయ్య 56వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పూల పందిరి సురేందర్, ఉపాధ్యక్షుడు కొండ్ర మోహన్, గౌరవ అధ్యక్షులు శెట్టి, బొడ్డు రాంచందర్, పోతరాజు, నవీన్, గడిచంద భోజన్న పాల్గొన్నారు.

పతంగుల దుకాణాలు తనిఖీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పతంగుల దుకాణాలను పట్టణ సీఐ శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ చైనా మాంజా దారం వాడకంతో ప్రాణాంతకరమన్నారు. దుకాణాల్లో చైనా మాంజను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆయుష్మాన్‌భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ కోరారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌లో ఆయుష్మాన్‌భారత్ కార్డుల నమోదుపై శనివారం అవగాహన కల్పించారు. నాయకులు కరిపె రంజిత్, బీమేష్, గంగాధర్, నిర్వాహకుడు భీమేశ్ ఉన్నారు.